క్లుప్తంగా

ప్రశాంతంగా ఈ ఏపీ సెట్ పరీక్ష

పెడన:మండలంలోని శ్రీవాసవి ఇంజినీరింగ్ కళాశాలలో సోమవారం నుంచి ప్రారంభమైన ఈఏపీ సెట్ -2023 పరీక్ష ప్రశాంతంగా జరిగింది. మొదటి రోజు ఉదయం సెషన్‌లో 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరిగిన పరీక్షకు 130 మందికి 128, మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు జరిగిన రెండో సెషన్‌లో 130 మందికి 127 మంది హాజరైనట్లు పరీక్షా కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ డాక్టర్ బీఆర్ ఎస్‌రెడ్డి, పరీక్షా కేంద్రం అడ్మిన్ పి.అశోక్‌కుమార్ తెలిపారు.

నేడు రైతులతో సమావేశం

పెడన:ఆన్‌లైన్ కాకుండా ఆఫ్‌లైన్‌లో ధాన్యం విక్రయించుకున్న (అమ్ముకున్న) రైతులతో మంగళవారం తహసీల్దారు కార్యాలయంలో సమావేశాన్ని ఏర్పాటు చేశామని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కొండవీటి నాగబాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆఫ్‌లైన్‌లో ధాన్యం విక్రయించుకున్న రైతులకు నగదు పడలేదనే విషయాన్ని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ దృష్టికి తీసుకెళ్లామన్నారు. మంత్రి ఆదేశాలతో మంగళవారం మిల్లర్లతో సమావేశాన్ని ఏర్పాటు చేశారన్నారు. మచిలీపట్నం ఆర్డీవో కూడా ఈ సమావేశానికి హాజరవుతున్నారని పేర్కొన్నారు. ఆఫ్‌లైన్‌లో విక్రయించుకున్న రైతులు తమ వద్ద ఉన్న ఆధారాలతో ఈ సమావేశానికి హాజరైతే వారికి రావాల్సిన బకాయి నగదును బ్యాంకు ఖాతాలలో జమ చేయిస్తామన్నారు.

పాదచారులకు మజ్జిగ పంపిణీ



మచిలీపట్నంటౌన్:వాసవి వనిత క్లబ్ మచిలీపట్నం శాఖ ఆధ్వర్యంలో సోమవారం పాదచారులకు మజ్జిగ పంపిణీ చేశారు. కన్యక పరమేశ్వరి దేవి అమ్మ వారి ఆలయం వెనుక బజారులో మాటూరి నాగభూషణం, భాను దమయంతి దంపతుల సహకారంతో మజ్జిగ పంపిణీ నిర్వహించినట్లు క్లబ్ ప్రతినిధులు శ్రీకాకోళపు రేణుకారాణి, వేముల శిరీష తెలిపారు. ఎండలు తగ్గేవరకూ ప్రతి రోజూ దాతల సాయంతో పంపిణీ చేస్తామని పేర్కొన్నారు.

లబ్ధిదారుల జాబితా ప్రదర్శన


ఘంటసాల(అవనిగడ్డ):మండలంలోని 13 రైతు భరోసా కేంద్రాల వద్ద 2023–24 సంవత్సరంకు సంబంధించి వైఎస్సార్ రైతు భరోసా అర్హుల జాబితాను ఏర్పాటు చేసినట్టు ఏవో మురళీకృష్ణ తెలిపారు. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం అర్హులైన వారు ఏదైనా కారణాల వల్ల అనర్హుల జాబితాలో పేరు ఉంటే గ్రామ వ్యవసాయ సహాయకుడిని సంప్రదించి ఈనెల 18వ తేదీ లోగా అర్జీ సమర్పించాలని సూచించారు.

పింఛనుదారుల ఆర్థిక సాయం



మచిలీపట్నంటౌన్:నగరంలోని 38వ డివిజన్‌కు చెందిన వైఎస్సార్ సామాజిక పింఛను లబ్ధిదారులైన వృద్ధురాలు కసుకుర్తి కమలమ్మ (83) ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. దీంతో ఆ డివిజన్‌లోని తోటి పింఛనుదారులు తలొక రూ. 100 సాయంగా సేకరించి వచ్చిన రూ. 20 వేలను కమలమ్మ కుటుంబ సభ్యులకు సోమవారం అందజేశారు. ఆ డివిజన్ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ శ్రీకాకోళపు నరసింహగుప్తా, అర్బన్ బ్యాంక్ డైరెక్టర్ శ్రీకాకోళపు రేణుకారాణి, వైఎస్సార్ సీపీ సచివాలయ కన్వీనర్ వేముల కృష్ణ, 40వ డివిజన్ వైఎస్సార్ సీపీ నాయకుడు సుతారి ఉదయకుమార్‌లతో కలిసి ఈ మొత్తాన్ని అందజేశారు.

పర్యావరణ పరిరక్షణపై ర్యాలీ



మచిలీపట్నంటౌన్:శారదానగర్‌లోని అంగన్‌వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో మిషన్ లైఫ్ ఎన్విరాన్‌మెంట్ కార్యక్రమంలో భాగంగా సోమవారం పర్యావరణ పరిరక్షణపై ర్యాలీ నిర్వహించారు. అంగన్‌వాడీ కార్యకర్తలతో పాటు తల్లులు, చిన్నారులు పాల్గొన్నారు. మొక్కలు పెంచటం వల్ల కలిగే లాభాలను ప్రజలకు వివరించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు బి.ఝాన్సీరాణి, కె.సౌజన్య, కె.బసవనాగులు, రాజేశ్వరి పాల్గొన్నారు.

సారా తయారీదారుల అరెస్ట్

కోనేరుసెంటర్:మండల పరిధిలోని కొత్తపూడి గ్రామంలో సారా తయారీకి పాల్పడుతున్న ముగ్గురిని పోలీసులు పట్టుకొని కేసు నమోదు చేశారు. బందరు రూరల్ ఎస్‌ఐ చాణక్య చేసిన ఈ దాడికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. కొత్తపూడి గ్రామానికి చెందిన పామర్తి నాంచారమ్మ అదే గ్రామానికి చెందిన సూదగాని బంగారయ్య, వట్టిప్రోలు రవికుమార్‌లతో కలిసి గ్రామంలోని పంచాయితీ కార్యాలయానికి సమీపంలో సారా తయారు చేస్తోంది. సమాచారం అందుకున్న పోలీసులు దాడి చేయగా ఆరు లీటర్ల సారాతో ముగ్గురు పట్టుబడ్డారు.

సమస్యలను సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలి

జిల్లా అధికారులతో మంత్రి జోగి రమేష్



మాట్లాడుతున్న మంత్రి జోగి రమేష్, పక్కన జిల్లా కలెక్టర్ రాజబాబు, జేసీ అపరాజిత సింగ్

పెడన:ప్రజా సమస్యలను సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖమంత్రి జోగి రమేష్ అన్నారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ హాల్లో నియోజకవర్గంలోని సమస్యలపై కలెక్టర్ రాజబాబుతో కలిసి వివిధ శాఖల అధికారులతో సోమవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ ఎసైన్డ్ భూముల్లో ప్రస్తుతం ఎవరైతే అనుభవదారులు ఉన్నారో వారికి పట్టా ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కృష్ణా యూనివర్సిటీకి కేటాయించిన స్థలానికి సంబంధించి నెలకొన్న సమస్యను పరిష్కరించాలని కోరారు. తీర ప్రాంతంలో తాగునీటి సమస్య ఉత్పన్నమవుతుందని, ఫిల్టర్ బెడ్‌లు మరమ్మతులకు గురైనట్లు తెలిపారు. పలు ప్రాంతాల్లో లో వోల్టేజ్ సమస్య నెలకొందని మంత్రి అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. పట్టణంలోని జగనన్న లే ఆవుట్లలో అంతర్గత రహదారులకు రూ.1.75 కోట్లు సరిపోవని, పెద్ద కాలనీలు కావడం వల్ల క్షేత్రస్థాయిలో పరిశీలించి నిధులు పెంచాలని సూచించారు. ఆక్వా రైతులకు సబ్సిడీపై విద్యుత్ పూర్తిగా అందడం లేదని పేర్కొన్నారు. పూర్తిస్థాయిలో విద్యుత్‌ను సరఫరా చేయాల్సిందిగా కోరారు. పలు మండలాల్లో సొంత ఇంటి కోసం దరఖాస్తు చేసుకున్నారని, వారి కోసం ఇళ్ల స్థలాలు మంజూరు చేయాల్సి ఉందన్నారు. ఆయా సమస్యలను మళ్లీ రెండు నెలలు తరువాత ఏర్పాటు చేసుకునే సమావేశంలో చర్చకు రాకుండా చూడాలని కోరారు. బాధ్యతగా ఆయా సమస్యలను పరిష్కరించి ప్రజల మన్ననలను పొందేలా నడుచుకుందామని ఆకాంక్షించారు. కలెక్టర్ రాజబాబు మాట్లాడుతూ మొట్టమొదటి సారిగా పెడన నియోజకవర్గానికి వచ్చానని తెలిపారు. ఈ ప్రాంతంలో ఏయే సమస్యలున్నాయో మంత్రి సంబంధిత శాఖాధికారుల దృష్టికి తీసుకురావడం జరిగిందన్నారు. డివిజన్, జిల్లా స్థాయిలో సమస్యలుంటే తన దృష్టికి వెంటనే తీసుకురావాలని చెప్పారు. వాటిని పరిష్కరించడానికి ఉన్న అవకాశాలను పరిశీలించి తక్షణ చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ అపరాజిత సింగ్, మచిలీపట్నం ఆర్డీవో కిషోర్, పెడన నియోజకవర్గంలోని ప్రజాప్రతినిధులు బళ్ల జ్యోత్స్నరాణి, చినబాబు, రత్నకుమారి, వెంకటరమణ, చారుమతి జిల్లా, డివిజన్, మండల అధికారులు పాల్గొన్నారు. సమావేశం అనంతరం మొదటి సారిగా పెడన నియోజకవర్గానికి విచ్చేసిన జిల్లా కలెక్టర్ రాజబాబును మంత్రి జోగి రమేష్ సత్కరించి పెడన కలంకారీ జ్ఞాపికను అందజేశారు. అలాగే జేసీ అపరాజిత సింగ్‌కు మహిళా ప్రజాప్రతినిధులు చారుమతి, జ్యోత్స్న వెంకటరమణ, రత్నకుమారి సత్కరించి జ్ఞాపికను అందజేశారు.

భానుడి ప్రతాపంతో బెంబేలు



నిర్మానుష్యంగా మారిన బందరు ప్రధాన రహదారి



పులిగడ్డ వద్ద నిర్మానుష్యంగా ఉన్న 216 జాతీయ రహదారి

మచిలీపట్నంటౌన్:భానుడి తాపంతో జనం బెంబేలెత్తుతున్నారు. నగరంలో సోమవారం 43 డిగ్రీల అధిక ఉష్ణోగ్రత నమోదైంది. దీనికి తోడు వడగాలులు, ఉక్కపోతతో ప్రజలు తల్లడిల్లారు. ఉదయం నుంచే భానుడు ప్రతాపం చూపటంతో ప్రజలు సాయంత్రం వరకు ఇళ్లకే పరిమితమయ్యారు. అధిక వేడిమితో బయటప్రాంతం నిప్పుల కొలిమిగా మారింది. దీంతో ప్రజలు బయట సంచరించేందుకు భయపడ్డారు. నగరంలోని ప్రధాన రహదారులు సైతం నిర్మానుష్యంగా మారాయి. దుకాణదారులు వ్యాపారాలు లేక మూసివేశారు. వేసవి తాపాన్ని తీర్చుకునేందుకు ప్రజలు శీతలపానీయాలు, కొబ్బరినీళ్లను సేవించారు.

అవనిగడ్డ:దివిసీమలో సోమవారం ఎండలు మండిపోయాయి. ఉదయం 8 గంటల నుంచే వడగాలులు ప్రారంభం కాగా రాత్రి 7 గంటల వరకూ కొనసాగాయి. దివిసీమలోని పలు ప్రాంతాల్లో సోమవారం 42 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. భానుడు తీవ్ర ప్రతాపం చూపించడంతో ద్విచక్ర వాహనదారులు, పాదచారులు బెంబేలెత్తిపోయారు. అత్యవసరమైన పనుంటే తప్ప బయటకు రావాలంటే భయపడిపోయారు. పులిగడ్డ వద్ద 216 జాతీయ రహదారిపై వాహనాల రాకపోకలు కరువడంతో నిర్మానుష్యంగా మారింది. కొంతమంది వడదెబ్బ తగిలి ఆస్పత్రుల పాలయ్యారు. వడగాలులు పెరిగినందున జాగ్రత్తలు పాటించాలని స్థానిక ప్రభుత్వ ఏరియా వైద్యశాల సూపరింటెండెంట్ నాగార్జున సూచించారు.

కోడూరు:భానుడి భగభగలకు మండల ప్రజలు అల్లాడిపోయారు. సోమవారం ఉదయం 7 గంటల నుంచే సూర్యుడు తన ప్రతాపాన్ని చూపడంతో ప్రజలు బెంబెలెత్తిపోయారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు తీవ్రమైన వడగాల్పులు వీయడంతో ప్రజలు ఇళ్లల్లో సైతం ఉండలేని పరిస్థితి. కోడూరులో అత్యాధికంగా 44.78 ఉష్ణోగ్రత నమోదైయినట్లు తహసీల్దార్ షేక్ లతీఫ్‌పాషా చెప్పారు. వడగాల్పుల ప్రభావం రాత్రి వరకు కొనసాగుతూనే ఉంది. ఎండ ప్రభావంతో రహదారులు మొత్తం నిర్మానుష్యంగా దర్శనమిచ్చాయి. వృద్ధులు, చిన్నారులు, దివ్యాంగులు ఎండ తీవ్రతకు అల్లాడిపోయారు. మరో రెండు రోజుల పాటు ఎండ తీవ్రత కొనసాగుతుందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మండల అధికారులు సూచించారు.

వెంకటేశ్వరస్వామి సేవలో మంత్రి రమేష్



కృత్తివెన్ను:మండల పరిధిలోని లక్ష్మీపురం గ్రామంలో జరుగుతున్న శ్రీ లక్ష్మీవెంకటేశ్వరస్వామివారి బ్రహ్మోత్సవాల్లో రాష్ట్ర గృహనిర్మాణశాఖ మంత్రి జోగి రమేష్ పాల్గొన్నారు. సోమవారం ఉదయం మంత్రి ఆలయానికి చేరుకుని స్వామివారిని దర్శించుకోగా అర్చకులు ప్రత్యేక పూజలు జరిపించారు. ప్రతి ఏటా బ్రహ్మోత్సవాలు ఎంతో వైభవంగా నిర్వహిస్తున్నామని ఆలపాటి లక్ష్మీనారాయణ తెలిపారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

మహాయజ్ఞంకు తరలిన భక్తులు



మోపిదేవి:విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో జరుగుతున్న అష్టోత్తర శత(108) కుండాత్మక చండీ, రుద్ర, రాజశ్యామల, సుదర్శన సహిత శ్రీ లక్ష్మీ మహా యజ్ఞంకు మోపిదేవి శ్రీ సుబ్రహ్మణ్యేశ్వరస్వామివారి దేవస్థానం ఏసీ ఎస్ఎస్ చక్రధరరావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రెండు బస్సులలో భక్తులు తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు జెండా ఊపి బస్సును ప్రారంభించారు. మండలంలోని పెదకళ్లేపల్లి, మోపిదేవితో పాటు గుంటూరు జిల్లా రేపల్లెకు చెందిన భక్తులు కూడా అధిక సంఖ్యలో పాల్గొన్నట్లు ఏసీ చక్రధరరావు తెలిపారు.

తాగునీటి సరఫరాకు పటిష్ట చర్యలు



జెండా ఊపి ట్యాంకర్ పంపిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ రాణి తదితరులు

పెడన:పైపులు ద్వారా తాగునీరు చేరని ప్రాంతాలకు ట్యాంకర్లు ద్వారా నీటిని అందించాలనే లక్ష్యంలతో పట్టణంలో రెండు ట్రాక్టర్ వాటర్ ట్యాంకులను ఏర్పాటు చేశామని మున్సిపల్ చైర్‌పర్సన్ భళ్ల జ్యోత్స్న రాణి అన్నారు. రెండు ట్యాంకర్లను సోమవారం ఆమె జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా రాణి మాట్లాడుతూ మంత్రి జోగి రమేష్ ఆదేశాల మేరకు కొన్ని ప్రాంతాల్లో పురప్రజలు కోరిక మేరకు ట్యాంకర్ల ద్వారా తాగునీటి సరఫరాకు చర్యలు తీసుకున్నామని చెప్పారు. ప్రతి వేసవిలో ట్యాంకర్లు ద్వారా తాగునీటి సరఫరా చేస్తున్నామని తెలిపారు. ఈ ఏడాది కూడా రెండు నెలలు పాటు సరఫరా చేసేందుకు అద్దె ప్రాతిపదికన రెండు ట్రాక్టర్లును ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు బళ్ల గంగయ్య, మెట్ల గోపీప్రసాద్, కమిషనర్ అంజయ్య, ఏఈ సీతారామాంజనేయులు, వైఎస్సార్ సీపీ నాయకుడు హుమయూన్ తదితరులు పాల్గొన్నారు.

పెదపట్నంనకు ట్యాంకర్‌ల ద్వారా తాగునీరు



కోనేరుసెంటర్:మండల పరిధిలోని పెదపట్నం గ్రామస్తులకు వేసవి దృష్ట్యా గ్రామ సర్పంచ్ గడిదేశి అనూష వాటర్‌ట్యాంకర్‌ల ద్వారా తాగునీటిని సరఫరా చేయిస్తున్నారు. గ్రామంలో తాగునీటికి గ్రామస్తులు ఇబ్బంది పడుతుండటంతో స్పందించిన ఆమె బందరు శాసనసభ్యుడు పేర్ని వెంకట్రామయ్య (నాని)కి సమస్య విన్నవించి గ్రామానికి వాటర్ ట్యాంకుల ద్వారా తాగునీరు అందించాలని కోరింది. ఆమె అభ్యర్థన మేరకు స్పందించిన పేర్ని గ్రామానికి ప్రతి రోజు రెండు వాటర్ ట్యాంక్‌లు తాగునీటిని సరఫరా చేసేలా ఆదేశాలు జారీ చేశారు. గ్రామస్తులకు తాగునీరు సక్రమంగా అందేలా సర్పంచ్ దగ్గరుండి పర్యవేక్షిస్తున్నారు. అడిగిన వెంటనే స్పందించిన ఎమ్మెల్యే పేర్ని నానికి గ్రామస్తులు కృతజ్ఞతలు తెలియజేశారు.

సచివాలయంలో రికార్డుల తనిఖీ



పెడన నాలుగో సచివాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న డీఎల్‌డీవో పద్మ

పెడన:సచివాలయ ఉద్యోగులు సమయ పాలన పాటించాలని సచివాలయాల మచిలీపట్నం డీఎల్‌డీవో జి.పద్మ అన్నారు. పట్టణంలోని నాలుగో సచివాలయాన్ని సోమవారం ఆమె తనిఖీ చేశారు. సిబ్బంది హాజరు పుస్తకంతో పాటు మూమెంట్ రిజిస్టర్లను పరిశీలించారు. ఎంత మంది సచివాలయంలో ఉన్నారు, మిగిలిన వారు ఎక్కడక్కకు వెళ్లారనే దానిపై వివరాలు సేకరించారు. అనంతరం ఉన్న సిబ్బందికి సచివాలయ విధులు, బాధ్యతలపై దిశా నిర్దేశం చేశారు. వలంటీర్లు ఎంత మంది ఉన్నది, వారిపై జవాబుదారీతనం ఎవరు నిర్వహిస్తున్నారు, సంక్షేమ పథకాలు అర్హుల, అనర్హుల జాబితాల ప్రదర్శన, ఎందుకు అనర్హులు అనే వివరాలతో ప్రదర్శించింది లేనిది పరిశీలించారు. ఆయుష్మాన్ భారత్ సర్వే ఎంత వరకు చేసింది తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈమెతో పాటు మున్సిపల్ సీనియర్ అసిస్టెంట్ పి.సుందరరావు తదితరులున్నారు.

ఘనంగా చర్చి వార్షిక మహోత్సవం

బిషప్ రాజారావు



క్రీస్తు సందేశం ఇస్తున్న బిషప్ జోసప్ రాజారావు

అవనిగడ్డ:నిత్య తృప్తితో మనిషి జీవించినపుడే సంతోషంగా ఉంటారని విజయవాడ మేత్రాసన బిషప్ తెలగతోటి జోసఫ్ రాజారావు అన్నారు. స్థానిక కోటగిరిలంకలోని తిరుకుటుంబ విచారణ (ఆర్‌సీఎం) చర్చి వార్షికోత్సవ మహోత్సవం ఆదివారం రాత్రి ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా బిషప్ జోసఫ్ రాజారావు మాట్లాడుతూ ఏసుక్రీస్తు యెడల విశ్వాసం, నమ్మిక, ప్రేమ కలిగి ఉన్నపుడే సంతోషంగా ఉంటారన్నారు. పవిత్రాత్మ దేవుడు ఉన్నచోట ప్రేమ ఉంటుందని, ప్రేమ లేకపోతే మనిషి జీవితం వ్యర్థమన్నారు. ప్రతి క్రైస్తవ విశ్వాసి తమ హృదయంలో క్రీస్తుని పవిత్రునిగా ప్రతిష్ఠించుకోవాలని కోరారు. ప్రభువు ఆజ్ఞలు స్వీకరించి ఆచరించినపుడు నిత్య జీవితంలో ఎంతో సంతోషంగా ఉంటారని చెప్పారు. విశ్వాసులు తోటి వారిపట్ల ప్రేమ, జాలి, దయ, సహాయత కలిగి ఉండాలన్నారు. జ్ఞానస్థానం ద్వారా క్రైస్తవులు అవుతారని, దీనిద్వారా పాపాలు పరిహారం అవుతాయన్నారు. 180 మంది చిన్నారులు, విశ్వాసులకు బిషప్ జోషఫ్ రాజారావు ధ్రువీకరణ అభ్యంగనం ఇచ్చారు. తొలుత సిలువ గుహ నుంచి ఆర్‌సీఎం చర్చి వరకూ బిషప్‌కి పూలు చల్లుతూ ఘనంగా తీసుకొచ్చారు. అనంతరం విశ్వాసులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. తిరుకుటుంబ విచారణ గురువు సురేష్ మెర్లోతో పాటు కోడూరు, నాగాయలంక, ఏసుపురం, లక్ష్మీపురం, కూచిపూడి, మచిలీపట్నం, పామర్రు, గుడివాడ, రేపల్లె, భట్టిప్రోలు విచారణ గురువులు, కోడూరు, నాగాయలంక, అవనిగడ్డ మండలాల నుంచి విశ్వాసులు పాల్గొన్నారు.

పోర్టు ఆహ్వాన పత్రికల పంపిణీ ప్రారంభం

మచిలీపట్నంటౌన్: ఈ నెల 22వ తేదీన రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బందరు పోర్టు పనుల ప్రారంభానికి విచ్చేస్తున్న నేపథ్యంలో ఈ కార్యక్రమానికి హాజరై జయప్రదం చేయాలని కోరుతూ వైఎస్సార్ సీపీ శ్రేణులు నగరంలోని పలు డివిజన్లలో సోమవారం ఇంటింటికి వెళ్లి ఆహ్వాన పత్రికలు అందజేశారు. మూడో డివిజన్‌లో కార్పొరేటర్ శీలం భారతి, మాజీ కౌన్సిలర్ శీలం బాబ్జి, 37వ డివిజన్‌లో కార్పొరేటర్ ఐనం తాతారావు, పార్టీ కార్యకర్తలు ఆహ్వానపత్రికలు అందించారు. వైఎస్సార్ సీపీ నగర కన్వీనర్లు గూడవల్లి నాగరాజు, శీలం బాబ్జి, చిటికిన నాగేశ్వరరావు పాల్గొన్నారు.

నేడు కమ్మనమోలులో చండీహోమం

కమ్మనమోలు(నాగాయలంక):సాయిబాబా మందిరంలో 16, 17తేదీల్లో షష్ఠమ వార్షికోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ వ్యవస్థాపకులు బండ్రెడ్డి నాగమల్లేశ్వరరావు సోమవారం తెలిపారు. మంగళవారం గోపూజ, దీక్షా ధారణ చండీ హోమం, సహస్రదీపాలంకరణ సేవ, చతుర్వేద పారాయణం జరుగుతాయి. 17న పంచామృత సహస్ర కలశారాధన, దత్తాత్రేయ సహిత శ్రీసాయి గాయత్రి ప్రధాన హోమాలు, మహాశాంతి హోమం, పూర్ణాహుతి తదుపరి అన్నసమారాధన నిర్వహిస్తారు. బుధవారం రాష్ట్ర నీటిపారుదలశాఖ మంత్రి అంబటి రాంబాబు, అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు పూజా కార్యక్రమాలకు హాజరవుతారని చెప్పారు.

దాహార్తి తీర్చటం అభినందనీయం



మజ్జిగ పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ రాజాబాబు

చిలకలపూడి(మచిలీపట్నం):స్పందన కార్యక్రమానికి వచ్చే అర్జీదారులకు దాహార్తిని తీర్చటం అభినందనీయమని కలెక్టర్ పి.రాజాబాబు అన్నారు. స్వచ్ఛ కలెక్టర్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఉద్యోగి తూము వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ఉచిత మజ్జిగ పంపిణీ కార్యక్రమం సంవత్సర కాలం పూర్తయిన సందర్భంగా కలెక్టర్ రాజాబాబు ఈ కార్యక్రమానికి విచ్చేశారు. మజ్జిగ పంపిణీలో ఆయన పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి ఉద్యోగి ఇటువంటి సేవా కార్యక్రమాల్లో పాలుపంచుకోవాలని కోరారు. సంవత్సర కాలంగా ప్రతి సోమవారం క్రమం తప్పకుండా నిర్వహించటం మంచి పరిణామమన్నారు. ప్రజల కోసం పలు ప్రాంతాల్లో స్వచ్ఛంద సంస్థలు ఏర్పాటు చేసి దాహార్తిని తీర్చాలని సూచించారు. డీఆర్వో ఎం.వెంకటేశ్వర్లు, కలెక్టరేట్ ఏవో ప్రసాద్, సూపరింటెండెంట్ ఎం హరినాథ్, రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎంవీ శ్యామ్‌నాథ్ తదితరులు పాల్గొన్నారు.

టీ టెన్ లీగ్ క్రికెట్ ట్రోఫీ విజేత చల్లపల్లి



పెదకళ్లేపల్లిలో క్రికెట్టు విజేత జట్టుకు బహుమతి అందచేస్తున్న నిర్వాహకులు

పెదకళ్లేపల్లి(మోపిదేవి):మండలంలోని పెదకళ్లేపల్లిలో జరుగుతున్న జిల్లా స్థాయి టీ టెన్ లీగ్ క్రికెట్ ట్రోఫీని ఫైనల్‌లో చల్లపల్లి జట్టు సొంతం చేసుకుంది. గత 20 రోజులుగా జరుగుతున్న ఈ క్రికెట్ పోటీల్లో ఆదివారం ఫైనల్ మ్యాచ్ అవనిగడ్డకు చెందిన శ్రీ తుంగపల్లెమ్మ తల్లి–11 జట్టు, చల్లపల్లి జట్టు తలబడ్డాయి. తొలుత బ్యాటింగ్ చేసిన చల్లపల్లి జట్టు నిర్ణీత 12 ఓవర్లలో ఐదు వికెట్లు కోల్పోయి 123 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన తుంగపల్లెమ్మ తల్లి జట్టు నిర్ణీత 12 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 49 పరుగులు మాత్రమే చేయగలిగిందని నిర్వాహకులు తెలిపారు. గ్రామ ప్రముఖులు తోట కృష్ణాంజనేయులు రూ. 10వేలు, ఎంపీటీసీ సభ్యురాలు అరజా ఆషాదేవి రూ. 10 వేలు మొత్తం రూ. 20 వేలు నగదుతో పాటు ట్రోఫీని విజేతలకు అందచేశారు. శ్రీ రామావెల్ఫేర్ సొసైటీ కన్వీనర్ తోట శ్యామ్‌కిషోర్ నాయుడు, స్నేహ సొసైటీ అధ్యక్షుడు గంధం పద్మజా నాయుడు, అనుమకొండ వాసు, గంధం వీరాంజనేయులు, అరజా కిరణ్‌కాంత్, తోట విజయలక్ష్మీ, చోడగం నానితో పాటు నిర్వాహకులు తోట హర్ష, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మిషన్ లైఫ్ పథకంపై అవగాహన



మిషన్ లైఫ్ పథకంపై అవగాహన కల్పిస్తున్న సీడీపీఓ సముద్రవేణి

బంటుమిల్లి:ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు ఆహారం, తాగునీరు వినియోగం కోసం జీవన ప్రమాణాల్లో మార్పులు చేసుకోవాల్సి ఉందని ఐసీడీఎస్ బంటుమిల్లి సీడీపీఓ ఎస్.సముద్రవేణి అన్నారు. మిషన్ లైఫ్ పథకం అవగాహన కార్యక్రమాల్లో భాగంగా బంటుమిల్లి ఎస్సీ కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సముద్రవేణి మాట్లాడుతూ ఆరోగ్య, ఆహార భద్రత కోసం చిరుధాన్యాల వినియోగం ప్రాముఖ్యతను, తాగునీటి వినియోగంలో భూగర్భ జలాలు అంతరించిపోకుండా ఇంకుడు గుంటల ద్వారా నీటిని ఏ విధంగా సద్వినియోగించుకోవాలన్న అంశాలపై స్థానికులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, అంగన్‌వాడి, ఆశా వర్కర్లు, మహిళలు పాల్గొన్నారు.

ఉత్సాహంగా వేసవి విజ్ఞాన శిబిరం



జిల్లా కేంద్ర గ్రంథాలయంలో వేసిన డ్రాయింగ్‌లను చూపుతున్న విద్యార్థులు



ఘంటసాలలోని శిక్షణ శిబిరంలో డ్రాయింగ్ వేస్తున్న చిన్నారులు

మచిలీపట్నంటౌన్:నగరంలోని పలు గ్రంథాలయాల్లో వేసవి విజ్ఞాన శిబిరాలు ఉత్సాహంగా కొనసాగుతున్నాయి. జిల్లా కేంద్ర గ్రంథాలయంలో సోమవారం చిన్నారులకు డ్రాయింగ్‌లో శిక్షణ ఇచ్చారు. అలాగే భగవద్గీతలోని 12వ అధ్యాయంలో 5వ శ్లోకం నేర్పించారు. కథలు చెప్పి పుస్తకాలు చదివించారు. డ్రాయింగ్ ఉపాధ్యాయురాలు వై.జయలక్ష్మి విద్యార్థులకు డ్రాయింగ్‌లో మెలకువలు నేర్పారు. ఈ సందర్భంగా విద్యార్థులు వేసిన డ్రాయింగ్ లు ఆకట్టుకున్నాయి. విద్యార్థుల్లో అన్ని రంగాలకు సంబంధించిన విజ్ఞానాన్ని పెంపొందించేందుకు ఈ వేసవిలో జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో జిల్లాలోని 99 గ్రంథాలయాల్లో వేసవి విజ్ఞాన శిబిరాలు నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ జిల్లా కార్యదర్శి వేములపల్లి రవికుమార్ అన్నారు. స్థానిక చిలకలపూడిలోని శాఖా గ్రంథాలయంలో జరుగుతున్న వేసవి విజ్ఞాన శిబిరాన్ని సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రంథాలయంలో చిన్నారులకు క్యారమ్స్, పుస్తక పఠనం వంటివి నిర్వహించారు. ఈ కార్యక్రమాలను ఆయన పరిశీలించి మాట్లాడుతూ గ్రంథాలయాల్లో జరుగుతున్న విజ్ఞాన శిబిరాలకు జిల్లా వ్యాప్తంగా విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొంటున్నారన్నారు. శాఖా గ్రంథాలయాధికారి డి.సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

విద్యార్థులకు వేసవి శిక్షణ తరగతులు

అవనిగడ్డ: మండల కేంద్రంలోని ప్రథమశ్రేణి గ్రంథాలయంలో విద్యార్థులకు వేసవి శిక్షణ తరగతులు కొనసాగుతున్నాయి. సోమవారం పుస్తక పఠనం, కథలు చెప్పడం, చదవడం, యోగాలో శిక్షణ ఇచ్చారు. ఉపాధ్యాయులు ఎస్.తిరుమలరావు, సిహెచ్ వినుకొండ, ఎం.శేషగిరిరావు విద్యార్థులకు శిక్షణ ఇవ్వగా లైబ్రేరియన్ జె.ప్రభుదాస్ పర్యవేక్షించారు. ఘంటసాల గ్రంథాలయంలో విద్యార్థులకు పలు అంశాల్లో శిక్షణ ఇచ్చారు. విద్యార్థులతో పుస్తక పఠనం, డ్రాయింగ్, కథలు చెప్పడంపై అవగాహన కల్పించారు. ఆరోగ్యంపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. మజ్జిగ పంపిణీ చేశారు.

అశ్రునయనాలతో కిషోర్ అంత్యక్రియలు



అవనిగడ్డ:హైదరాబాద్‌లో గుండెపోటుతో మరణించిన సీఐఎస్ఎఫ్ జవాన్ విశ్వనాధుని యువ కిశోర్ (36) అంత్యక్రియలను మండల పరిధిలోని అశ్వరావుపాలెంలో సోమవారం అశ్రునయనాలతో నిర్వహించారు. ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు, జెడ్పీటీసీ చింతలపూడి లక్ష్మీనారాయణ యువకిశోర్ భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ సందర్భంగా సీఐఎస్ఎఫ్ సీఐ, ఎస్ఐతో పాటు పలువురు సిబ్బంది హైదరాబాద్ నుంచి తరలి రాగా అధికార లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు.